క్లుప్తంగా

19 నుంచి కావమ్మ మారయ్య ఉత్సవాలు

రొంపిచెర్ల: మండలంలోని మోటుమల్లెల పంచాయతీ బెస్తపల్లిలో నూతనంగా నిర్మించిన కావమ్మ, మారయ్య ఆలయంలో మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 19న కావమ్మ జీవిత చరిత్ర కథ, గోపూజ, గంగపూజ, యోగశాల ప్రవేశం, గణపతి పూజ, వాస్తు పూజ, వాస్తు హోమం, 20వ తేదీ కంకణ పూజ, ఋత్విక్ చరణం, విగ్రహాల ఊరేగింపు, అన్నదానం రాత్రి కావమ్మ జీవిత చరిత్ర కథ, 21న కావమ్మ, మారయ్య విగ్రహ ప్రతిష్ట, అభిషేకం, అగ్నిగుండ ప్రవేశం, అన్నదానం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారు.

తరల్ వర్క్ బుక్స్ పంపిణీ



తరల్ వర్క్‌బుక్స్ పంపిణీ చేస్తున్న ఎంఈఓ

పెద్దపంజాణి: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తరల్ పుస్తకాలను ఎంఈఓ హేమలత ఎంఆర్‌సీ కార్యాలయంలో సోమవారం హెచ్‌ఎంలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. సమ్మర్ క్యాంపు పుస్తకాలను 3,4,5 తరగతుల విద్యార్థులకు చేరవేయాలన్నారు. పిల్లలు ఇంటి వద్ద వర్క్ బుక్కును ప్రాక్టీసు చేసే సమయంలో ఏవైనా సందేహాలు వస్తే నివృత్తి చేసేందుకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలని సూచించారు. విద్యార్థులు ప్రాక్టీసు చేసిన ఫొటోలను గ్రూపులో పోస్టు చేయాలని కోరారు.

జేవీడీ స్టాక్ పాయింట్ తనిఖీ



జేవీడీ కిట్లను పరిశీలిస్తున్న గీత

పలమనేరు: పట్టణంలోని ఎమ్మార్సీలో జగనన్న విద్యాకానుక స్టాక్ పాయింట్‌ను రాష్ట్ర పరిశీలకురాలు గీత సోమవారం తనిఖీ చేశారు. వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ఏడు రకాల వస్తువులు, పుస్తకాలు, నిఘంటువులను పరిశీలించారు. ఇరువురు టీచర్లను పర్యవేక్షణలో ఉంచాలని సూచించారు. ఆమె వెంట ఎంఈఓ లీలారాణి, గుణశేఖర్ ఉన్నారు.

దాడిపై కేసు నమోదు

సదుం: దాడి సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మారుతి తెలిపారు. ఆయన కథనం మేరకు.. కంభంవారిపల్లెకు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి బస్టాపు సమీపంలోని పొలంలో నూతనంగా గృహం నిర్మిస్తున్నాడు. ఈ నేపథ్యంలో అదే గ్రామనికి చెందిన ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మనోజ్‌కుమార్‌రెడ్డితో స్థల వివాదం నెలకొంది. వీరిద్దరూ తమ ఇంటిపై రాళ్లు, మద్యం బాటిళ్లతో దాడి చేసి ఫర్నిచర్ ధ్వంసం చేసినట్లు విజయ్‌కుమార్‌రెడ్డి భార్య అనిత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితురాలి అరెస్టు చూపుతున్న సెబ్ పోలీసులు

పలమనేరు: పలమనేరు సెబ్ పరిధిలోని ఏడు చుట్ల కోట వద్ద మారెమ్మ అనే మహిళ నుంచి 90 టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు డీటీఎఫ్ సీఐ మాధవస్వామి సోమవారం తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా పేర్నాంబట్ మార్గంలో రూట్ వాచ్ చేస్తుండగా నిందితురాలిని పట్టుకున్నట్లు తెలిపారు. ఆమెను స్థానిక కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. సెబ్ ఎస్‌ఐ మస్తాన్‌వలి, నాగరాజ పాల్గొన్నారు.

జశ్విన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

చౌడేపల్లె: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి కుమారుడు జశ్విన్‌రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కళ్యాణ్‌భరత్, ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్ స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో కేక్ కట్ చేశారు. రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు హరీష్‌రాయల్, జయచంద్ర, సుదీర్, గిరిబాబు, చంద్ర, రాజేష్ ముని పాల్గొన్నారు.

మోసాలకు అడ్డా.. సరిహద్దుల గడ్డ

- రకరకాల మోసాలతో బురిడీ కొట్టిస్తున్న అంతర్రాష్ట్ర ముఠాలు
- మోసగాళ్లే నకిలీ పోలీసుల అవతారం ఎత్తి దాడులు
- సరిహద్దు ప్రాంతాలనే లక్ష్యంగా చేసుకుని మోసాలు
- ఇదే వృత్తిగా వందలాదిమంది
- వీకోటలో పట్టుబడిన నకిలీ డీఎస్పీ
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు





మోసగాళ్లు చూపించే అసలైన బంగారు నాణెం, ఆపై అంటగట్టే నకిలీ నాణేలు(ఫైల్)



మహిమగల శంఖం



నకిలీ రెండువేల కరెన్సీ(ఫైల్)



పోలీసులు సీజ్ చేసిన అక్షయపాత్ర (ఫైల్)

పలమనేరు: జిల్లాలోని పడమటి ప్రాంతాలైన పలమనేరు, కుప్పం నియోజకవర్గాలు, కర్ణాటక, తమిళనాడు సరిహద్దులు మోసాలకు అడ్డాలుగా మారాయి. మొన్నటి దాకా రైస్‌పుల్లింగ్, నిన్న పూడుపాములు, నకిలీ బంగారు నాణేలు, ఇప్పుడు రెండువేల నోట్ల ముఠాల వ్యవహారాలు వెలుగుచూస్తున్నాయి. మూడు రాష్ట్రాల కూడలిగా ఉన్న ఈ రెండు నియోజకవర్గాలనే టార్గెట్‌గా చేసుకొని పలు అంతర్రాష్ట్ర ముఠాలు హల్‌చల్ చేస్తున్నాయి. వీరి కారణంగా ఎందరో అమాయకులు లక్షల్లో మోసపోతున్నారు. చాలామంది పోలీసులకు సైతం చెప్పలేక మదనపడుతున్నారు. వీటి మత్తులో పడి కొందరు ఇప్పటికే తమ జీవితాలను నాశనం చేసుకున్నారు. అప్పులు కట్టలేక పలువురు కనిపించకుండా పోయారు.

కొందరికి ఇదే వృత్తి..

ఇలాంటి ముఠా మాటలు నమ్మి సులభంగా కోట్లు సంపాదించాలనే ఆశతో వందలాదిమంది మోసాలే వృత్తిగా చేసుకున్నారు. వీరు మరిందరు ఏజెంట్లను తయారు చేసుకుని పురాతన రాగిపాత్రల అన్వేషణ, రెండువేల నోట్లు, రైస్‌పుల్లింగ్, పూడు పాములు ఇలా రకరకాల మోసాలకు దిగుతున్నారు. తొలుత ఈ ముఠా వద్ద మోసపోయిన బాధితులు సైతం తిరిగి ఇదే రొచ్చులోకి దిగి పలువురుని మోసగిస్తున్నారు. గత నాలుగేళ్లలో పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో ఇలాంటి పలు ముఠాలను పోలీసులు పట్టుకుని కేసులు పెడుతూనే ఉన్నారు. కానీమోసాలు మాత్రం జరుగుతూనే ఉన్నాయి.

మహత్తుగల శంఖం అంటూ..

తమ వద్ద మహత్తుగల శంఖం ఉందని దాన్ని బియ్యంలో వేసి మూసేస్తే అదందకదే పైకి వస్తుందని సోషల్‌మీడియాలో వీడియోలను పెట్టి మోసాలకు దిగుతున్నారు. దీనికి చైనాలో కోట్లలో గిరాకి ఉందని నమ్మిస్తున్నారు. దీన్ని నిజమని నమ్మిన వాళ్లను బురిడీ కొట్టించి దొరికినంత దోచుకునే ముఠాలు ఇప్పుడు ఈ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు సమాచారం.

ఆగని రైస్‌పుల్లింగ్ మోసాలు

పురాతన కాలం నాటి అక్షయపాత్ర, రాగిపాత్రలు బియ్యాన్ని ఆకర్షించే శక్తి ఉండడాన్నే రైస్ పుల్లింగ్ అంటారు. ఇలాంటి బియ్యాన్ని ఆకర్షించే రాగి పాత్రలకు బయటి దేశాల్లో కోట్లాది రూపాయల గిరాకీ ఉంటుందని ఈ ముఠా నమ్మబలుకుతున్నారు. ఆర్‌పీ అంటే రైస్ పుల్లింగ్ అని సీఆర్పీ కాపర్ రైస్ పుల్లర్, సీఐపీ అంటే కాపర్ ఇరిడియమ్ రైస్ పుల్లర్‌ల పేరిట ఈ తంతు ఇక్కడ సాగుతోంది.

ఇవేగాక మరెన్నో టోపీ ముఠాల మోసాలు

ఆర్‌పీతోపాటు నకిలీ బంగారు నాణేలు, బంగారు బిస్కెట్లు, మహిమగల పాత్రలు, దేవుళ్ల విగ్రహాలు, పూడుపాములు, నక్షత్రతాబేళ్లు, సంజీవిని వేరు, మహిమగల తావీజులు, రెండువేల నోట్లు మోసాలకు పాల్పడే ముఠాల సంచారం కొన్నేళ్లుగా సరిహద్దు ప్రాంతాల్లో సాగుతూనే ఉంది. ఈ ముఠాల కారణంగా ఎందరోబాధితులు లక్షలు పోగొట్టుకున్న విషయం తెలిసిందే. ఏదేనీ మోసంలో పోలీసులకు పట్టుబడితే చెన్నై, బెంగళూరుకు చెందిన ప్రముఖ న్యాయవాదులు వీరికి బెయిల్ ఇప్పించేందుకు వస్తున్నారంటే వీరి నెట్‌వర్క్‌ను అర్థం చేసుకోవచ్చు.

పదిమంది దాకా అదృశ్యం

గత పదేళ్లలో పలమనేరు పోలీసు సబ్‌డివిజన్‌పరిధిలో ఇలాంటి సంఘటనలు పదుల సంఖ్యలో జరిగాయి. బాధితులు లక్షల్లో మోసపోయారు. మోసాలకు పాల్పడే గ్యాంగ్‌లలో బాగా చదువుకున్న వ్యక్తులు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, కర్ణాటకా పోలీసులు ఉండడం కొసమెరుపు. తమిళనాడుకు చెందిన ఓ అందమైన యువతి ఇలాంటి గ్యాంగ్‌లకు లీడర్‌గా ఉన్నట్టు సమాచారం. ఈ రొచ్చులోకి దిగిన పదిమంది వరకు ఇప్పటికే అదృశ్యమయ్యారు. ఈప్రాంతంలో ఈ తరహా మోసాలు చేసే వ్యక్తులు 50 మంది దాకా ఇతర రాష్ట్రాలకు చెందినవారు మరో 50 మంది కాగా వీరి ఏజెంట్లు మరో వందమంది దాకా ఉన్నట్టు తెలుస్తోంది.

మోసగాళ్ల బిల్డప్‌లిలా...

సరిహద్దు కర్ణాటక, తమిళనాడు గ్రామాల్లో రకరకాల మోసాలకు పాల్పడేవాళ్లు వందల సంఖ్యలో ఉన్నారు. అంతర్రాష్ట్ర ముఠాలు సంబంధిత ప్రాంతాల్లోని ఏజెంట్లతో కలిసి ఖరీదైన కార్లను అద్దెకు తీసుకుని బంగారు ఉంగరాలు, మెడకు చైన్లను ధరించి బడా కోటీశ్వరులా బిల్డప్ లిస్తుంటారు. వీరి మొత్తం వ్యవహారమంతా మొబైల్‌ఫోన్లు ఆపై రహస్య ప్రదేశాల్లోనే నిర్వహిస్తుంటారు. బాగా డబ్బున్న వారిని లక్ష్యంగా చేసుకుని వారితో డీల్ చేసుకుని కేవలం రాత్రి సమయాల్లో ఓ ప్రదేశానికి డబ్బుతో రమ్మని ఇలాంటి వ్యాపారాలు సాగుతుంటాయి. ఈ సమయంలో వీరి మనుష్యులే పోలీసుల వేషాల్లో వచ్చి దాడులకు పాల్పడడం లేదా దాడులు ఇలా రకరాలుగా సినీ ఫక్కీలో ఈ మోసాలకు పాల్పడుతుంటారు. వ్యవహారాలు వెలుగుచూసి రాజకీయనాయకులతో పంచాయతీలు, పోలీసు కేసులకు దాకా వెళ్లినపుడు స్మగ్లర్ల చెప్పే కోట్ల మాటలకు వీరు సైతం ఫిదా అవుతున్నారు. వీరి డీళ్లు 2సీ, 5సీ, 10 సీ అంటే కోట్లలోనే ఉంటాయి. ఈ మాటలు విన్నవారుసైతం దురాశకు వెళ్లి ఈ రొచ్చులోకి దిగుతున్నారంటే వీరి మోసాలు ఎలా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

ఏకంగా కర్ణాటక డీఎస్పీ, పోలీసుల వేషంలో మోసగాళ్లు..



నకిలీ డీఎస్పీ ముళబాగిలు శివన్న

తాజాగా పలమనేరు నియోజకర్గంలోని వీకోటలో జరిగిన మోసంలో ఐదుగురు కలిసి తమవద్ద భారీగా రెండువేల నోట్లున్నాయని త్వరలో వీటిని ప్రభుత్వం రద్దు చేస్తుందని శ్రీనివాసపురానికి చెందిన ఓ వ్యక్తిని నమ్మించారు. మామూలు కరెన్సీ రూ.లక్ష ఇస్తే 2వేల నోట్లు రూ.1.20లక్షలు ఇస్తామని చెప్పి వీకోట సమీపంలోని పట్రపల్లి వద్దకు రప్పించి కర్ణాటక పోలీసులు దాడులు చేసినట్టు డ్రామా చేసి రూ.5లక్షలతో ఉడాయించారు. ఎట్టకేలకు పోలీసులు నకిలీ డీఎస్పీ వేషంలో ఉన్న ముళబాగళ్ శివన్న అతని బృందాన్ని అరెస్ట్ చేశారు.

అత్యాశకుపోయి మోసపోవద్దు



తరచూ ఇలాంటి మోసగాళ్లను పట్టుకుని అరెస్ట్ చేస్తూనే ఉన్నాం. ఇలాంటి మోసగాళ్ల మాటలను నమ్మరాదని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కానీ మోసాలు జరుగుతూనే ఉన్నాయి. ఈజీ మనీకోసం పోతే ఉన్న డబ్బును పోగొట్టుకోవాల్సి వస్తుంది. జాగ్రత్తగా ఉంటే ఎలాంటి ఇబ్బంది ఉండదు.
సుధాకర్‌రెడ్డి, డీఎస్పీ, పలమనేరు.

అర్హులందరికీ ఇంటి పట్టాలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్సీ భరత్



సంక్షేమ బావుటా బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: అర్హులందరికీ జగనన్న కాలనీల్లో ఇంటి పట్టాలు మంజూరు చేస్తామని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మేజర్ గ్రామపంచాయతీ రామకుప్పం పరిధిలోని మిట్టపల్లి గ్రామంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భరత్ పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు చేకూరుతున్న లబ్ధిని వివరించారు. గ్రామంలో ఎక్కువశాతం ప్రజలు ఇంటి పట్టాలు, పక్కా గృహాలను మంజూరు చేయాలని ఎమ్మెల్సీని కోరారు. స్పందించిన ఆయన అర్హులందరికీ ఇంటి పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్ మురళీని ఆదేశించారు. గృహ నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని హౌసింగ్ అధికారులకు సూచించారు. గ్రామాల్లో సిమెంటు రోడ్లు, కాలువల నిర్మాణాలు తదితర మౌలిక సదుపాయాల కోసం మరింత నిధులను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును దేశమంతా ఆదర్శంగా తీసుకుంటోందన్నారు. ప్రజాక్షేత్రంలో ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్న తనకు ఒక్క అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా స్థానిక ప్రజాప్రతినిధులు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సచివాలయ కన్వీనర్లు రామిరెడ్డి, జబీవుల్లా, నేతలు చంద్రారెడ్డి, మధురెడ్డి, రాధారెడ్డి, శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, ప్రకాష్, రమణ పాల్గొన్నారు.

స్పందన వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టండి



సూచనలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

గంగవరం: స్పందనలో వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని గండ్రాజుపల్లి–1 గ్రామ సచివాలయాన్ని సోమవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టిక, సీఎల్ రిజిస్టర్లతో పాటు సచివాలయ సేవలు, స్పందన, సచివాలయ సర్వీస్ రిజిస్టర్లను పరిశీలించారు. నవరత్నాల పథకాలు అర్హులందరికీ తప్పకుండా అందాలని సిబ్బందిని ఆదేశించారు. స్పందనలో వచ్చే అర్జీలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట సర్పంచ్ మల్లికార్జున, ఎంపీటీసీ భాస్కర్ ఉన్నారు.

ఓంశక్తి ఆలయంలో ప్రత్యేక పూజలు



అగ్గిసెట్లలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు

పలమనేరు: పట్టణ సమీపంలోని ఎద్దులచెరువు కట్టపై వెలసిన ఓంశక్తి ఆలయంలో గంగమ్మ జాతరను పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ తదితరులు హాజరయ్యారు. అగ్గిసెట్ల కార్యక్రమంలో భక్తులు తలపై కుండలతో కూడిన కలశాలను మోసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కౌన్సిలర్లు కుమార్, శ్యాము, హేమంత్, నవీన్ పాల్గొన్నారు.

టీడీపీ అసత్య ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న విజలాపురం బాబురెడ్డి

రామకుప్పం: వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ అసత్య ప్రచారాలను చేయడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి అన్నారు. మండలంలోని మిట్టపల్లి గ్రామంలో సర్పంచ్‌లతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. బాబురెడ్డి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ సర్పంచ్ మోహన్‌నాయక్‌పై టీడీపీ సోషల్ మీడియా దుష్ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఆధారాలు లేకుండా బాలికను లైంగికంగా వేధించారంటూ పోస్టులు పెట్టడం హేయమైన చర్య అన్నారు. తమ నాయకులను టార్గెట్ చేస్తూ అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. సర్పంచ్ మోహన్‌నాయక్ మాట్లాడుతూ.. తనపై తప్పుడు పోస్టులు పెట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ మానవ హక్కుల కమిషన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. ఎంపీపీ సుబ్రమణ్యం, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గడప గడపకు..

గంగవరం: మండలంలో మంగళ, బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. పసుపత్తూరు గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో రెండు రోజుల పాటు కార్యక్రమం జరుగుతుందన్నారు. మంగళవారం నాయనిచెరువు, ఎగువ గొర్రెలదొడ్డి, ఎర్రోనిగుట్ట నడిమి, దిగువ గొర్రెల ద్దొడి, కురప్పల్లి గ్రామాల్లో ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు హాజరు కావాలన్నారు.

అర్ధగిరి క్షేత్రంలో వేడుకగా ప్రాకారోత్సవం



ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తీసుకెళుతున్న భక్తులు

తవణంపల్లె: అర్ధగిరి శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానంలో సోమవారం ప్రాకారోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామికి సుప్రభాత సేవ, అభిషేకాలు, 9 గంటలకు వసంతోత్సవం, నివేదన, మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి పల్లకిలో కొలువైన స్వామిని ప్రాకారోత్సవం చేస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు. వసంతోత్సవంతో హనుమాన్ జయంతి వేడుకలు ముగిశాయి.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

శాంతిపురం: కుప్పం నుంచి రేగడదిన్నేపల్లికి బైకుపై వెళ్తున్న వారిని ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు గాయపడ్డారు. రేగడదిన్నేపల్లికి చెందిన మునినారాయణప్ప(57), మంజునాథరెడ్డి (40) సోమవారం కుప్పంలో టీడీపీ నిర్వహించిన ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్లారు. ర్యాలీ అనంతరం తిరుగు ప్రయాణంలో వీరి బైకును శాంతిపురం వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొంది. దీంతో మునినారాయణప్ప తీవ్రంగా, మంజునాథరెడ్డి స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని 108 ద్వారా కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా ప్రమాదానికి కారణమైన కారును గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

వైభవంగా విగ్రహాల ప్రతిష్టాపన



స్వామివారి సేవలో ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి: మండలంలోని నాగిరెడ్డిపల్లి పంచాయతీ లింగమనాయునిపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీనందీశ్వర ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. కుంభాభిషేకం కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, దైవ దర్శనం చేసుకున్నారు. వైస్ ఎంపీపీలు జీడీ బాబు, ఆంజమ్మ, కో–ఆప్షన్ సభ్యుడు రహంతుల్లా, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు కుమారమ్మ, రమేష్ బాబు, నాయకులు శ్రీనివాసులు, శ్రీనివాసులు రెడ్డి, క్రిష్టారెడ్డి, రాజారెడ్డి, లతీఫ్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో బలిజలకు గుర్తింపు



మాట్లాడుతున్న బలిజ సంఘం నాయకులు

కుప్పం: వైఎస్సార్‌సీపీలో బలిజ కులస్తులకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని బలిజ సంఘ నాయకులు, ఏపీఐడీసీ డైరెక్టర్ నందకుమార్ అన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కుప్పంలో బలిజ కులస్తులకు కేటాయించిన స్థలంలో ప్రాంగణ గోడ నిర్మాణం కోసం ప్రభుత్వం రూ. 25 లక్షలు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. బలిజ కులస్తులకు 2.28 ఎకరాల స్థలం కేటాయించారని గుర్తు చేశారు. గతంలో ఏ ప్రభుత్వం బలిజ కులస్తులను పట్టించుకోలేదని, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. త్వరలో ప్రాంగణ గోడ నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. ఈ మేరకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనావాసులు, ఎమ్మెల్సీ భరత్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బలిజ సంఘ నాయకులు వెంకటరమణ, విజయ్‌కుమార్, అవినాష్, నారాయణ, హరినాథ్, ఆశ్వత్, జయరాం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత భాస్కర్‌రెడ్డి మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి

రొంపిచెర్ల: వైఎస్సార్‌సీపీ నేత, రొంపిచెర్ల ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తం రెడ్డి చిన్నాన్న చిచ్చిలి భాస్కర్ రెడ్డి (90) మృతి బాధాకరమని పీలేరు మాజీ ఎమ్మెల్యే జీవీ.శ్రీనాథరెడ్డి అన్నారు. మృతదేహానికి ఆదివారం రాత్రి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సలీంబాషా, జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు నూలు రెడ్డెప్ప, విజయశేఖర్, రమణమ్మ, సర్పంచ్‌లు ఇబ్రహీంఖాన్, నాగిరెడ్డి, జీవలత, సుధారాణి, రమణయ్య, అన్సర్‌బాషా, హేమలత ఉన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరిద్దాం



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు పోకల చంద్ర

పులిచెర్ల(కల్లూరు): గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే గుర్తించి పరిష్కరించాలని వెంకటదాసరపల్లె ఎంపీటీసీ సభ్యుడు పోకల చంద్ర అన్నారు. గ్రామ సచివాలయంలో సిబ్బంది, వలంటీర్లు, కన్వీనర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ గ్రామాల్లో పర్యటిస్తూ ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గంగయ్య, పంచాయతీ కార్యదర్శి సుబ్రమణ్యంరెడ్డి, చెంగల్‌రాయులు పాల్గొన్నారు.

ఇష్టంతో చదివితేనే ఉత్తమ ఫలితాలు



తాము వేసి డ్రాయింగ్‌ను చూపుతున్న విద్యార్థులు

వి.కోట: విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని గ్రంథాలయ సిబ్బంది అన్నారు. సోమవారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పులువురు ఉపాధ్యాయులు విద్యార్థులకు డ్రాయింగ్, రీడింగ్, ఇంగ్లిష్, కథలపై శిక్షణ ఇచ్చారు. మొత్తం 25 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

గుడుపల్లె: క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని.. ఒత్తిడి దూరమవుతుందని పీఈఎస్ కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ క్రిష్టారావు అన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని పేర్కొన్నారు. సోమవారం పీఈఎస్ కళాశాలలో వైద్య విద్యార్థులకు వార్షిక టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. 15 రోజుల పాటు జరిగే పోటీల్లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయని తెలిపారు. గెలుపొందిన జట్లకు ట్రోఫీ అందిస్తామన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ క్రిష్టారావు